


# 'శార్వరి'

రచయిత : 'కరుణాసాగర'

సాయంకాలం నాలుగున్నరగంట అయింది. రాజు గబగబ టాయిలెట్టయి పోయాడు. గాబర్డీన్ సూటులో మిలమిల లాడి పోతున్నాడు. పౌడర్ కోటింగు సరిగా ఉందోలేదో అని అనుమానమేసి, మరోసారి అద్దంలో తన ముఖం చూసుకొన్నాడు. మనస్సుకి సంతృప్తికరంగానే ఉంది. నిగనిగలాడే బాటాబూట్లు నడుస్తున్నప్పుడు ఒక వింత అయిన హాయిని చేకూర్చుతున్నాయి. రూమ్‌కి తాళంవేసి, రోడ్డుమీద పడ్డాడు. సైకిళ్లూ, కార్లూ, రెండెడ్లబళ్లూ తనని పురోగమించడమే కాకుండా, కొన్ని తిరోగమిస్తున్నాయ్. వీటిని వేటినీ లెక్కచెయ్యకుండా రాజు తారురోడ్డుమీద బాటా బూట్లను కిర్రు కిర్రు లాడించుకుంటూ గబగబ నడిచి పోతున్నాడు. అతన్ని ఆపే శక్తి ఎవరికీ లేదేమో? ఇంకా తీవిగా గబగబ నడుస్తున్నాడు కాని, 'తాజ్ హొటల్' బోర్డుని చూడగానే రాజు కాళ్లకి బ్రేకులు పడ్డాయి, "అలస్యాదమృతం విషం" అన్న ఆర్యోక్తిని అనుసరించి లోపలికి దూరాడు.

పదణాల బిల్లుచేశాడు. పక్కనే వున్న కిల్లీ కొట్టువద్దకెళ్ళి, ఒక మీఠాకిల్లీ కట్టించుకున్నాడు. తాపీగా కిల్లీ నములుతూ, రోడ్డుమీద బాటా బూట్లని కిర్రు కిర్రులాడిస్తూ, మళ్లీ నడుస్తున్నాడు. ఇవాళ ఎందుకో రాజు చాలా ఆనందంగా వున్నాడు. క్రాస్‌వర్డ్స్ పజిల్సులో ప్రయిజ్ వచ్చిందా అంటే అదీలేదు... మరి ఎందుకీ ఆనందం?......ఈ రోజు ఆదివారం... జన్మానికో శివరాత్రి అన్నట్లు ఆఫీస్ గుమాస్తాలు ఆదివారం వచ్చిందంటె చాలా ఆనంద పడుతారు. వారంరోజులకి ఒక్కరోజయినా స్వతంత్రంగా, హాయిగా గాలిని పీల్చకపోతే జీవితమెందుకు కాల్చనా? అదీ రాజు ఆనందానికి సిసలయిన కారణం,

"ఏమోయ్ రాజూ!" వీపు చుర్రుమంది. రాజు వెనక్కి తిరిగిచూశాడు. మిత్రుడు, సాహిత్యప్రియుడు, మూర్తి. కరస్పర్శ కావించుకోడం పూర్తి అయింది. 'శార్వరి' రాసిన నవలలు ఏమయినా నీదగ్గర ఉన్నాయా రాజూ!" అన్నాడు మూర్తి, 'శార్వరి' నవల లంటే చెవికోసుకుంటాను నేను. అతని నవల లంటే చాలా లైక్ చేస్తాను. కాని, నాదగ్గర పుస్తకాలు ప్రస్తుతం ఏవీ లేవోయ్! రాజు పేలవంగా సమాధానమిచ్చాడు.

"శార్వరి" రాసిన "విషకుంభం" నవల చదివావా ?

"అబ్బే"

"భగ్నజీవి" "అరుణోదయం" నవలలు చదివావా?

"లేదే!" రాజు సమాధాన మిచ్చాడు.

పోనీ "జీవితాశయం" చదివావా ?

"లేదంటే! "విసుక్కున్నాడు రాజు.

సరీ... ఈమధ్యనే రిలీజయిన "కిరణ్మయి" నవల చదివావా ?

మళ్ళీ ప్రశ్న!

"మహాప్రభూ నీ కోదండం.... నేను చదువలేదు!" అంటూ నిజంగానే దండంబెట్టాడు రాజు.

"సరే వస్తా!" అంటూ సమాధానాన్ని ఆశించకుండా ఎదురుగా ఉన్న జనసమూహంలో కలసిపోయాడు మూర్తి.

"శార్వరి" నవలలపట్ల అతనికున్న పిచ్చిని తలుచుకుంటే రాజుకి నవ్వాగిందికాదు.

"బాబూ" అని ఒక ముష్టివాడు పలకరించేవరకూ రాజు ఈలోకంలో లేనేలేడు. అప్పుడు రాజుకు జ్ఞాపకం వచ్చింది. తాను 'ట్రాఫిక్ వే'కి అడ్డంగా ఉన్నానని. తన్ని లోకంలో పడవేసిన ముష్టివాడివైపు తేరిపార చూశాడు. లోతుకు పీక్కుపోయిన కళ్లూ, చప్పిదవడలూ, గుంటలుపడ్డ మొహమూ, దొక్కుపోయిన కడుపూ, చింపిరి పేలికలూ, అబ్బ! చూట్టానికి చాలా అసహ్యంగా ఉన్నాడు. ప్రశ్నార్థకంగా మొహంపెట్టాడు రాజు.

"కానీ ధర్మం చేయండి బాబూ!" అబ్బ!—ఎంత దీనంగా ఉన్నాయి అతని చూపులు! ఆ బిచ్చగాడి మొహంలో గూడుకట్టివున్న దారిద్ర్యం స్ఫుటంగా ద్యోతకమవుతోంది. అర్థంకాని ఆవేదనతో పరితపిస్తున్న అతని హృదయం ఒక్క కానీ అర్థించింది.

రాజు జేబులో చేయిపెట్టాడు.

చేతికి పావలాకాసు తగిలింది.

ఇంకా తడిమాడు. రెండురూపాయిల నోటు తప్ప మఱేమీ తగలలేదు. బిచ్చగాడికి పావలా ఇద్దామంటే మనసొప్పకుండా ఉంది. పోనీ, ఆపావలానే బిచ్చగాడికి ధర్మంచేస్తే...? వేమారు స్తుతిస్తూ ఆరోజు పర్వదినంగా భావిస్తాడు. ఏదైనా తింటాడు. కాని, మనస్సు వద్దంటోంది. తమ ఎంత ధార్మిక హృదయుడయినా ఒక్కసారి పావులా ధర్మంచేయడమే!.. కాస్సేపు సంకోచించి, బిచ్చగాడితో చిల్లరలేదనిచెప్పి, వడివడిగా ముందుకు సాగిపోయాడు రాజు. బిచ్చగాడు ఎందుకో-ఏమో బీచివైపు దారితీశాడు.

తారురోడ్డుమీద రాజు వడివడిగా నడుస్తున్నాడు. కాని రాజు మనస్సు ఈ లోకంలో లేదు. బిచ్చగాడికి ఒకకానీ ధర్మం చేయలేకపోయానే అని అతని మనస్సు పీడిస్తోంది. ఇంకా వడివడిగా అడుగులేస్తూ పోతున్నాడు. ఎదురుగుండా ఉన్న ఒక బుక్‌స్టాల్ కనిపించింది. రాజు ఇంతో అంతో సాహిత్య ప్రియుడు. ఏదేనా ఒక సారస్వతపత్రిక కొందామని స్టాల్‌లోకి దూరాడు. బుక్‌సెల్లర్ ఆదరాభిమానాలతో ఆహ్వానించి రకరకాల పుస్తకాలు చూపించాడు. కాని...రాజుకు అవేవీ నచ్చక 'శార్వరి' నవలలు ఏవైనా ఉన్నాయా? అని ప్రశ్నించాడు. అడగడమే తరువాయి... ఆ బుక్‌సెల్లర్ ఒక నవలలసెట్టు అతని ముందుంచాడు. 'విషకుంభం' 'భగ్నజీవి' 'అరుణోదయం'-ఎన్నో నవలలు ఉన్నాయ్. రాజు రెండురూపాయిలిచ్చి 'విషకుంభం' 'భగ్నజీవి' నవలలు కొన్నాడు. ఆ రెండు నవలల్నీ పట్టుకుని, గృహోన్ముఖుడయ్యాడు.

* * *

చెప్పరాని సంఘటన ... అజుని కయినా వర్ణించ శక్యంగాదు ... ఎవరికయినా గుండె జల్లుమంటుంది—అంతటి రక్తపాతం రాజు కనివిని ఎరుగడు. ఎదురుగుండా రక్తప్రవాహంలో పొర్లాడుతూన్న బిచ్చగాడ్ని చూచి రాజు బిత్తరపోయాడు. ఎవరో మఱో తోటి బిచ్చగాడు చందాలు అడుగుతున్నాడా బిచ్చగాని శవాన్ని దహనం చేసేందుకు. బిచ్చగానిమీదనుంచి డ్రైవ్‌చేసి పారిపోయిన కారుడ్రైవరు గుఱించి పోలీసులు అక్కడమూగిన జనాన్ని వివరాలు అడుగుతున్నారు. చందా ఇద్దామని రాజు జేబులో చేయిపెట్టాడు. చేతికి పావలాకాసు తగిలింది. చందా అడుగుతూన్న బిచ్చగానికిచ్చాడు ఆ పావలా కాసుని. బతికుండగా ఇవ్వక చచ్చిన తర్వాత ఇచ్చానే! అని మనస్సు మథనపడిపోతోంది.

"ఏమండీ రాజుగారూ!" అని సమీపంగా ఉన్న జనసమూహంలోంచి కాషియర్ మూర్తి పరామర్శచేశాడు. రాజుకో ఆలోచన తట్టింది.

"మూర్తిగారూ ఓ పది రూపాయిలు ఉంటే ఇస్తారూ!" - "రేపు తప్పకుండా ఇస్తా!" అని ప్రాధేయపడ్డాడు.

"ఓ-దానికేం ఇందండి!" అంటూ మూర్తి జేబులోంచి పదిరూపాయిల నోటు తీసిచ్చాడు. రాజు ఆ పది రూపాయిల నోటుని అందుకొని బిచ్చగాడికిచ్చాడు. "దీనితో దహనక్రియ జరిపించు" అన్నాడు ఆ బిచ్చగాడి కళ్లు మిలమిల లాడాయ్.

చనిపోయిన ఆ బిచ్చగాని జోలెలో ఓ నీలిరంగు నోటుపుస్తకం వెలవెలపోతూ కన్పించింది. రాజు దాన్నందుకున్నాడు.

'నా జీవితం' రచన: శార్వరి అని ఆ పుస్తకం అట్టమీద ఉంది. బిచ్చగాడి శవంవంక రాజు దీక్షగా చూశాడు. ప్రసిద్ధ రచయిత 'శార్వరి' బిచ్చగాడా? రాజు కళ్లు రెండు కన్నీటి చుక్కలను వర్షించాయి!

టేబుల్‌మీద ఉన్న 'శార్వరి' నవలలు రాజుని వెక్కిరిస్తున్నాయ్. సానుభూతితో అతని హృదయం ద్రవించింది. ఏదో గట్టి ఆలోచనవచ్చి ఢగ్గుమని కుర్చీలోంచి లేచాడు. ★



రవుతూ పిక్చర్సువారి

" నిత్యకల్యాణం - పచ్చతోరణం " లో

చలం, కృష్ణకుమారి